
# చీకట్లో



శ్రీ జానకిరాం పట్నాయకులు.

అర్ధరాత్రప్పుడు, ఉన్నట్టుండి మావారు ఒకటే తుమ్మడం ప్రారంభించారు. రమారమి ఏభయి, అరవయి తుమ్ములు ఒకటే వరుసను దొర్లిపోయినాయి. మొదటి అయిదారు తుమ్ములకే నాకు తెలివి వచ్చేసింది. అంత అకస్మాత్తుగా ఆ తుమ్ములు రావడానికి నాకే ఆశ్చర్యమనిపించింది. ఎప్పుడేనా జలుబు చేస్తే ఏవో కొన్ని వందలు తుమ్ములు రావడం అలవాటు గాని, ఈలా ఉత్తకఉత్తినే తుమ్మడం ఎన్నడూ లేదు.

తుదకు కారణం తేలింది! ఏ మూలనుంచో ఒక దోమ వచ్చి ఆయన ముక్కులో దూరిపోయింది! అయితే తిరిగి వెళ్ళిపోరావద్దూ? ఊహు! దాని ప్రాణానికి "బకింగ్ హామ్ పాలెస్"లా కనిపించిందేమో అక్కడ విశ్వ విహారంచేసింది. అయితే యీ నికృష్ట కీటకానికి ఆ మహోనకమైన జాగాలో స్థానం దొరుకుతుందీ? మొదటి రెండు తుమ్ముల్లోనే, చచ్చి చెడి, అల్లంత దూరాన్న పడిపోయింది! దాని పాటుకేంగాని, మావారు మాత్రం వ్యవధి లేకుండా "ఛటీ-బటీ" మంటూ వార్సా డాన్జిగుల్లో పడ్డ నాజీ బాంబుల్లా తుమ్ముల బాంబులు వర్షింపించారు. నిజంగా ఏ మహానుభావుడేనా "తుమ్ములపోటీ" అని ఒక బహుమానం ఉంచి ప్రకటించి నట్టయితే, మా వారే ఆ బహుమానం పుచ్చుకోగలరని నేను బల్ల గ్రుద్ది చెప్పగలను.

ఏమయితేనేం ఆ తుమ్ముల హడావిడిలో నేను నిద్రకు స్వస్థి చెప్పవలసి వచ్చింది. మావారు మాత్రం తిరుగా కుంభకర్ణుని పాత్ర, తీసుకున్నారు మల్లాది వారి 'కుంకుమరేఖ'లోని గోవింద మూర్తిలా! ఉక్క విస్తారంగా పోస్తూన్నందున కిటికీ తలుపులు తెరచి అక్కడనే నిలుచున్నాను పడమటి సముద్రంలో మున్కలిడుతూన్న చంద్రుణ్ణి చూస్తూ.

అకస్మాత్తుగా దృష్టి, దూరంలో ఉన్న సరుగుడు తోపులోనికి ప్రసరించింది. అభేద్య మైన కాటుక కొండలు నిలిపినట్టుగా ఉంది ఆ ప్రదేశం! నిశ్శబ్దదేవత ఆచిమ్మ చీకటిలో విశ్వవిహారం చేస్తూంది.

ఆ తోపులో, తెల్లగా ఏదో ఒక జీవి కదుల్తూన్నట్టయింది. తొలుత ఒక ఆవుఏమో అని తలచాను, కాని ఆవుకాదు! గుఱ్ఱం అనుకున్నాను. అదీకాదు! నిలువునా ఒక మనిషి రూపంగా కనిపించింది.! గుండెలు బరువెక్కి పోయింది. అవయవ సంచాలనం కట్టుబడి పోయింది. చిన్నతనంలో మా నాన్నమ్మ చెప్పిన దయ్యాల కథలు జ్ఞాపకాని కొచ్చాయి! ఇదీకూడా ఏదో మహాభూతం అన్న సంగతి స్థిరమైంది. లేకపోతే ముందుగా ఆవులా తరువాత గుఱ్ఱంలా, పిమ్మట మనిషిలా కనపడ్డానికి కారణం ఏమిటి? దయ్యం తలంపునకు రాగానే నాకు చైతన్యం లేదు, కిటికీ మూసేసి, మంచంమీదకు పోయి, గట్టిగా ముసుగు దన్ని పడుకుందాం అనిపించింది. అయితే కిటికీ మూసేందుకు చేతులు ఎత్తినాను. కాని వచ్చినవి కావు. మా వారిని లేపుదాం అని నోరు కదల్పబోయాను. కాని దౌడలు నొక్కుకు పోయాయి. పావుగంటసేపు ఆలానే ఉండిపోయాను.

ఉన్నట్టుండి నా కళ్ళు తిరుగా ఆ అంధకారం వేపు తిరిగినాయి. ఆ తెల్లని వ్యక్తి మా యింటివేపేవస్తూంది, మనస్సు కొంచం పదిలంగావించుకొని, తేరి పారచూచినాను. దయ్యం కాదన్న నమ్మకం కొంచెం కలిగింది. ఎవడయినా దొంగ అయి ఉంటాడేమో అన్న అనుమానం తట్టింది. నిజమే! దొంగాడే! తిన్నగా వంటయింటివేపు వెళ్తున్నాడు. దయ్యమే అయితే కిటికీదగ్గరకే వచ్చి పీక నులిమివేసివుండును. ఎంతమాత్రం దయ్యం కాదు! ముమ్మాటికీ దొంగయే!"

అయితే యిప్పుడు ఏం చెయ్యడం? వంటయింట్లో వంటమనిషి సుబ్బమ్మ ఒక్కర్తే ఉంది. దాన్ని ఊరుకోబెట్టడం ఒక రెప్పపాటయినా చాలదు! సరి ఇక సామానులు సంగతి? వెండి సామాన్లు అన్నీ అలమారులో ఉన్నయి. రమారమి 300 రూపాయిలు ఖరీదుగలవి! అది చిక్కించుకున్న తరువాత యిక్కడ? ఇనప్పెట్టెలో బంగారునగలు, నగదు ఆస్తీ అంతా ఒక్కసారి సఫా! ఒక్క నిముషంలో సర్వనాశనం!! అయితే ఆ దొంగను ఏలా ఎదుర్కోవడం? నేనా? ఆడదాన్ని! మా వారా? నిద్రాదేవిని వదలకుండా తెలివితేటలు లేక పడిఉన్నారు. పోనీ లేపి పంపిద్దామంటే ఒక్కరు! ఏం సాహసించగలరు? అందులోనూ దొంగతో! అన్నింటికీ తెగించిన ప్రాణితో! వాడిదగ్గర ఏదయినా అయుధం కత్తి-గొడ్డలి-బాకు-రివాల్వరు ఉంటే మరేం ఉంది? ఈ ఊహల్తో తిరుగా నా ప్రాణవాయువులు హరించుకు పోయాయి.

ఆలా మరో ఐదు నిముషాలు నిలబడి పోయాను. ఎందుకేనా మంచిదని వారిదగ్గరకు ఒక్క ఉరుకున వెళ్ళి లేప నారంభించినాను,

"ఏ వండోయి! లేవండి లేవండి!! కొంప మునిగిపోయింది!!" అన్నాను ఆయన్ను కదుపుతూ.

"ఊ" అంటూ అటునుంచి యిటుప్రక్క తిరుగవేసినారు.

"లేవండీ త్వరగా- ఇప్పుడే దొంగ వంట యింటివేపు వెళ్తున్నాడు. నాకండ్లతో చూచినాను. ఆ యింట్లో వెండి సామాన్లు పడి ఉన్నాయి."

"బండీ! బండీక్యారే, చుప్‌రహొ! హారామ్" అంటూ మరింత ముణకరించుకున్నారు.

ఇదేమిటిబాబూ! నే నొకటంటే ఆయన ఒకటి! పలువరింతలు! ఇదేం నిద్రతల్లీ!

ఇంకేం సాధనం తోచక గట్టిగా ఒక గిల్లు గిల్లినాను.

"అబ్బా! ఏమిటీగోల!!" అంటూ కండ్లువిప్పి చూచినారు.

"గోలా? అవతల కొంప లంటుకుపోతూంటె! ఎవడో దొంగ వెధవ వంటయింట్లో దూరి అంతా దోచుకుపోతున్నాడు! గంటయి లేపినా ఫికరు లేదు."

"ఆ(—ఆ(- దొంగనా? ఎక్కడ? కట్టి పట్టు కురా! అరే! దీపం ఏదీ?"

ఇంత గందరగోళం చీకట్లోనే జరిగింది. అగ్గిపెట్టె కని వెదికినాను. దొరికింది కాదు! తలగడక్రింద ఉన్న "బేటరీ" దీపం తీశాను. "స్విచ్" నొక్కాను. చప్పున వెలిగి ఆరిపోయింది. మళ్లా "స్విచ్" నొక్కాను. మరి చలనం లేదు. రెండుపర్యాయాలు అటూ యిటూ కదిపి నొక్కాను, అంతే!

"బల్బు కాలిపోయింది కాబోలు" అన్నారు మావారు.

ఇంతలో బయట ద్వారం దగ్గర బేటరీ దీపపు వెల్తురు కన్పించింది. ఉన్న ఆ కాస్త ప్రాణాలు పోయినట్లయింది! మావారుకూడ ఆతృతతో పడక మీదనుంచి లేచారు. ఆయన్ను వెనక్కు లాగి "జాగ్రత సుమండీ! ఆ దొంగవెధవ అక్కడ కాజేసుకొని యిక్కడకు వచ్చినట్టుంది"అన్నాను

"ఉండు! చౌకీదారును కేకవేస్తాను" అని మావారు కిటికీ దగ్గరకు వెళ్లి "ఏం చౌకీదార్! చౌకీదార్" అని భయంగొల్పే గొంతుకుతో కంగారుగా అరచినారు, మావీధి చివరంటనే, రోడ్డు ప్రక్కన చౌకీదారు ఉండే చిన్న కొంప ఉంది. దైవశాత్తు వాడుహాజరై వున్నాడు.

"క్యా హై బాబూజీ!" అని వాడు నోరందుకున్నాడు.

అవతల తలుపుమీద గ్రుద్దిన చప్పుడైంది. "రామారావుగారూ!" అన్న పిలుపుకూడ వినబడ్డది. అరే! ఈ దొంగలరాయడికి మావారి పేరు ఎల్లా తెలిసింది. ఎక్కడో వాకబు చేసి ఉంటాడు. పట్టవాసపు దొంగ కదూ ఎంతయినా!!

"బయట ద్వారందగ్గర ఎవడో గల్లంతు చేస్తున్నాడు. వెళ్లి చూడు" అన్నారు మా ఆయన చౌకీదారుతో.

"బహూ తచ్చా బాబూజీ!" అంటూ వాడు క్షణంలో ద్వారం దగ్గరకు వచ్చి "కోన్ హ్లాజీ బద్మాష్" అంటూ కేకవేసినాడు.

మాకూ కొంత భయం తీరింది కనుక, తలుపు తీసినాము. చౌకీదార్ ఆ వ్యక్తి చేతిని గట్టిగా పట్టుకుని ఎగాదిగా చూస్తున్నాడు.

తలుపు తీసిన చప్పుడు వినగానే "ఏమండోయి రామారావుగారూ! ఈ వెధవేమిటి నన్ను పట్టుకొని వదలకున్నాడు" అని ఆ వ్యక్తి అన్నాడు.

"ఓహో! అప్పారావు బావగారా? మంచి సందడే అయింది లెండి! సంగతంతా మీ చెల్లెల్ని అడగండి" అన్నారు మావారు,

నాకు సంతోషమూ, సిగ్గూ ఆవరించుకుంది. ఏలాగో మనస్సు పదిలపర్చుకొని "అన్నయ్యా! బాగున్నావా? ఇంట్లో అందరూ కులాసాగా ఉన్నారు కదూ? ఒంటిగంట బండిలో వచ్చినావా ఏమిటి? ఉత్తరమైనా వ్రాశావు కావు ఈలా వస్తున్నా అని" అన్నాను. మేం ముగ్గురమూ లోపలికి వెళ్లినాము. చౌకీదారుకూడ "అచ్ఛా మతలబ్" అని నవ్వుకుంటూ మరలిపోయానాడు.

"ఉత్తరం వ్రాస్తై ఈ తంతు అంతా ఏలా జరుగుతుంది" ఏలానో పాపం! తోబుట్టువును దొంగ అని పోలీసువాణ్ణి ఒప్పచెప్పావు! అలా ఉండాలె బహూద్దీరీతనం" అన్నారు మావాడు.

"నాదికాదు బహూద్దరీతనం! మీ తుమ్మల్ది" అన్నాను నేను.

